క్లుప్తంగా

కండలేరులో 52.438 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 52.438 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 1,000 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి 4,000 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నేడు గదులకు వేలం పాటలు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి సీహెచ్‌సీ బండెలదొడ్డి సమీపంలోని మున్సిపాలిటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న 14 గదులకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శ్రీనాథ్ తెలిపారు. అలాగే అమ్మవారిపేట, కుమ్మరిగుంట, చెవిరెడ్డిపల్లి, ధర్మాపురం, పెరియవరం, మరాటపల్లి, పోలిశెట్టిగుంట, మనులాలపేట చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు వేలం పాటలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కల వారు కార్యాలయ పని దినాలు, కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాలు నేరం

సైదాపురం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సైదాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. సైదాపురంలో బుధవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తర్వాత వివాహాలు చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వెల్లడించారు. అనంతరం బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. హెచ్ఎం సుభాషిణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

కోట: మండలంలోని చెందోడు శ్మశానవాటికలో నీటి సమస్య పరిష్కారానికి దాతల సహకారంతో బోరు ఏర్పాటు చేశారు. చెందోడుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పల్లంరెడ్డి రమణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. రమణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు హరనాథ్‌రెడ్డి రూ.లక్ష వెచ్చించి శ్మశానంలో బోరు వేశారు. గ్రామస్తులతో కలిసి బుధవారం బోరును ప్రారంభించారు. అదేవిధంగా చెందోడు సచివాలయానికి ఆరు కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో దాత హరినాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట: సూళ్లూరుకు చెందిన జెడ్పీ హైస్కూల్ విశ్రాంత హెచ్ఎం గంగరాజు లక్ష్మయ్య నేత్రాలను బుధవారం కుటుంబ సభ్యులు దానం చేశారు. పట్టణంలోని ఆచార భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్నియాలను సేకరించి చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ వారికి అందించారు. లక్ష్మయ్య మరణించినా ఆయన నేత్రాలు ఇద్దరికి చూపు ప్రసాదించడంతో వారిలో ఆయన కళ్లు బతికే ఉంటారని కుటుంబసభ్యులు ముందుకొచ్చి నేత్రదానం చేశారు.

భక్తులకు అన్నదానం

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని సత్రపు వీధిలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో ఎక్కువ శాతం శబరిమలై వెళ్లేందుకు అయ్యప్ప మాలధారణ చేస్తుంటారని తెలిపారు. వారికి మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అన్నదానం చేస్తున్నట్టు వివరించారు.

ప్రజల ఆరోగ్య వివరాలు నమోదు చేయాలి

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీపీఎంవో శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గూడూరు పరిధిలోని చెన్నూరు, చిల్లకూరు, గూడూరు అర్బన్‌లోని పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లలో ఉంటున్న వారి ఆరోగ్యంతో, వ్యాధులు, తీసుకుంటున్న చికిత్స, వైద్య సిబ్బంది అందిస్తున్న మందుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఎస్‌వో నాగేంద్ర కుమార్, డీపీవో ప్రకాష్, చిల్లకూరు వైద్యులు అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణం జాతీయ రహదారి కూడలిలో బుధవారం బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం రోసనూరు వద్ద ఉన్న సింపాల్ టైల్స్ పరిశ్రమలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మోహన్ తివారీ, ఒడిశాకు చెందిన కె.రాముడెడ్డి పనిచేస్తున్నారు. వీరు నాయుడుపేటలోని శ్రీరామ్ నగర్‌లో ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇద్దరు బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. జాతీయ రహదారి కూడలి సమీపంలో లారీ ఢీకొంది. మోహన్ తివారీ చేయి తెగి పడిపోయింది. రాముడెడ్డికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని 108 సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోహన్‌తివారీని మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. లారీని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నరక ప్రయాణం


అధ్వానంగా ఉన్న కప్పగుంటకండ్రిగ రోడ్డు

రోడ్లు బాగుంటే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుంది. అందుకే రహదారులు ప్రగతికి చిహ్నాలు అని పెద్దలు చెబుతూ ఉంటారు. పెళ్లకూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు లోతైన గుంతలతో కంకర తేలిపోయి దుమ్ము.. దూళి వెదజల్లుతున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. మేము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే అన్ని రోడ్లనూ బాగు చేస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు గొప్పలు చెప్పారు. అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తివుతున్నా రోడ్ల గురించి పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- దెబ్బతిన్న గ్రామీణ ప్రాంత రోడ్లు
- రాళ్లు తేలిన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెళ్లకూరు: మండలంలోని పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రోడ్లన్నీ దుర్భరంగా మారాయి. దీంతో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. మొత్తం 24 పంచాయతీల్లో 56 కిలోమీటర్లు పంచాయతీరాజ్ రోడ్లున్నాయి. వీటిలో 12 కిలో మీటర్లు బీటీ, 7 కిలో మీటర్ల సీసీ రోడ్లు ఏర్పాటు చేశారు. మిగిలిన 37 కిలో మీటర్లు పంచాయతీ రోడ్లన్నీ పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. కంకర తేలడంతో ప్రయాణం చేయడం కష్టతరమైంది. యడపూడి, కిష్టప్పకండ్రిగ, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ, జువూనుగుంట తదితర గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో నందిమాల, పునబాక, భీమవరం, ఆర్లపాడు గ్రామాలకు బీటీ రోడ్లు, రావులపాడు, జీలపాటూరు గ్రామాలకు సిమెంట్ రోడ్లు వేశారు. అలాగే మండలంలో 68 కిలో మీటర్లు ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయి. పునబాక, చెంబేడు, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా పునబాక సమీపంలో ఉన్న ఒక ప్లైవుడ్ పరిశ్రమకు భారీ స్థాయిలో వాహనాలు కలప రవాణా చేస్తుంటాయి. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న కంకర క్వారీలకు అధిక సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. ఈ క్రమంలో ఇక్కడ రోడ్లన్నీ లోతైన గుంతలు పడి వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇదే మార్గంలో శిరసనంబేడులో ఉన్న ఓస్టీల్ పరిశ్రమకు భారీ వాహనాల ద్వారా ముడి సరుకులు రవాణా చేయడంతోపాటు అక్కడి నుంచి ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ ఉంటారు. ఈ క్రమంలో భారీ వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పునబాక - చెంబేడు ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి

చినుకు పడితే బస్సు సౌకర్యం లేదు

మండలంలో గ్రామీణ రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో చినుకుపడితే రోడ్లపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో పలు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నిలిపేస్తున్నారు. ముఖ్యంగా శ్రీకాళహస్తి నుంచి చెంబేడు వెళ్లే ఆర్టీసీ సర్వీసు, నాయుడుపేట నుంచి నందిమాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోతున్నాయి. స్వర్ణముఖి నదిపై కలవకూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్ డ్యామ్‌పై వర్షాకాలంలో వరదనీరు ప్రవహిస్తుండడంతో శ్రీకాళహస్తి నుంచి పాలచ్చూరుకు వెళ్లే ఆర్టీసీ సర్వీసు నిలిపేస్తున్నారు. దీంతో వర్షాకాలంలో పల్లె జనులు, విద్యార్థులు, చిరుద్యోగులు పట్టణాలకు వెళ్లేందుకు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది.

రోడ్లన్నీ ప్రమాదకరంగా ఉన్నాయి



చెంబేడు క్రాస్ రోడ్డు నుంచి పునబాక, చెంబేడు, చెన్నప్పనాయుడుపేట, రాజుపాళెం, శిరసనంబేడు గ్రామాల వరకు సుమారు 12 కిలోమీటర్ల రోడ్లలో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఆటోలు, బైకుల్లో వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సి వస్తోంది. రోడ్లను బాగు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. –కుమారస్వామి, పునబాక

అధికారులు పట్టించుకోవడం లేదు



మండలంలోని పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాహనాలు సక్రమంగా నడిచే పరిస్థితి లేదు. రోడ్ల దుస్థితిపై చర్చించేందుకు అర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు అందుబాటులోకి రావడం లేదు. మండల సర్వసభ్య సమావేశాలకు కూడా వారు రావడం లేదు. సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోవడం లేదు. –పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, ఎంపీపీ, పెళ్లకూరు

రేపు గూడూరులో జాబ్ మేళా

గూడూరు రూరల్: గూడూరు రెండవ పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం తెలిపారు. ఇందులో వివిధ బహుళజాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేపడతామని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఆ పైన చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని వెల్లడించారు. అభ్యర్థులు ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, బయోడేటా ఫాంతో వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకుని అడ్మిట్ కార్డు పొందాలని సూచించారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

సూళ్లూరుపేట: భారత రాజ్యాంగ పరిషత్తు దేశానికి రాజ్యాంగాన్ని అందించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని బ్రహ్మప్రకాష్ హాలులో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తప్పక పాటిస్తే దేశం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి రాజ్యాంగంపై అవగాహన కల్పించి దేశం. దేశభక్తి గురించి తెలియజేయాలని సూచించారు.

చెరువుల ఆక్రమణపై ఆర్డీవో విచారణ

- టీడీపీ వర్గీయులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు
- ఆక్రమణలన్నీ తొలగించాల్సిందేనని సర్పంచ్ డిమాండ్


ఆర్డీవో కిరణ్మయి ఎదుట వాగ్వాదానికి దిగిన టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

దొరవారిసత్రం: మండలంలోని వెదురుపట్టు పంచాయతీ తుంగమడుగు, దుప్పలవారికండ్రిగ, వెదురుపట్టు చెరువు పొరంబోకు భూముల ఆక్రమణపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్మయి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, రైతులు ఆక్రమించిన చెరువు భూములను తొలిగించాలని అధికార పార్టీ నాయకుడు మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై స్థానిక సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఆక్రమణలను తొలగించాలని కోరారు. అలాకాకుండా టీడీపీ నాయకులు, వారి మద్దతు కల రైతుల ఆక్రమణలో ఉన్న భూములను వదిలి వైఎస్సార్ సీపీకి చెందిన రైతులు, నాయకుల ఆక్రమణలో ఉన్న వాటిని మాత్రమే తొలగించాలని చూడడం తగదన్నారు. దీనిపై పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. ఆర్డీవో మాట్లాడుతూ మొత్తం తొలగించే స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ శైలకుమారిని ఆదేశించారు. నాలుగు చెరువుల పొరంబోకు భూములు 25 ఎకరాలను 13 మంది ఆక్రమించుకున్నారని, వారికి ఇప్పటికే 7, 6 నోటీసులు జారీ చేసినట్టు తహసీల్దార్ పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని ఇరిగేషన్ శాఖ అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఇది ఇలా ఉండగా వాస్తవానికి వెదురుపట్టు పంచాయతీలోని నాలుగు చెరువుల పొరంబోకు భూములు 70 ఎకరాలకు పైగా 40 మంది ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు టీడీపీ వర్గీయులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమణలను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. మండల సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.11.82 లక్షలు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.11,82,207 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం దేవదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యులు అనివెట్టి మండపంలో హుండీల్లోని కానుకలను లెక్కించారు. ఈవో మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో మూడు నెలల క్రితం హుండీలను లెక్కించామన్నారు. తాజాగా లెక్కించగా గతంలో కన్నా ఆదాయం పెరిగిందన్నారు. ఇందులో రూ.11,82,207 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, దేవదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు, అర్చకులు శివకుమార్‌స్వామి పాల్గొన్నారు.

తలుపులు తెరుచుకున్న మరుగుదొడ్లు

సాక్షి ఎఫెక్ట్..



డీవీ సత్రం రైల్వే స్టేషన్‌లోని మరుగుదొడ్లు

దొరవారిసత్రం: దొరవారిసత్రం, పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్‌లోని మరుగుదొడ్లు ఎట్టకేలకు తెరుచుకున్నాయి. రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల కోసం నిర్మించిన మరుగుదొడ్లకు కొన్నేళ్లుగా తాళాలు వేసి ఉన్నాయి. దీనిపై గత వారం సాక్షి దినపత్రికలో ×అలంకారప్రాయంగా మరుగుదొడ్లు¥ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై సంబంధిత రైల్వే అధికారులు స్పందించారు. డీవీ సత్రం, పోలిరెడ్డిపాళెం ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలోని మరుగుదొడ్లకు వేసి ఉన్న తాళాలను సిబ్బందితో తెరిపించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా ఈరెండు స్టేషన్ల పరిధిలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. ప్లాట్ ఫారాల్లోని కొళాయిల్లో తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

సూళ్లూరుపేట: జీఎస్టీ చెల్లించే వ్యాపారులు తప్పనిసరిగా ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని తిరుపతి జిల్లా జీఎస్టీ అధికారి రవికుమార్ తెలిపారు. సూళ్లూరుపేటలోని వ్యాపారులకు బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేస్తున్న వ్యాపారానికి సంబంధించి అన్ని అంశాలను పొందుపరిచి బిల్లులు అందజేయాలని కోరారు. జీఎస్టీకి ఆధార్ కార్డును అనుసంధానం చేస్తే వ్యాపారానికి సంబంధించిన లావాదేవీలు సక్రమంగా వుంటాయని సూచించారు. జీఎస్టీ డిప్యూటీ కమిషనర్లు షబీనా, ఇందిరా ప్రియదర్శిని, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్


బహుమతులు అందుకున్న విద్యార్థినులు

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా యువకేంద్రం అధికారి మహేంద్రరెడ్డి తెలిపారు. రాపూరు మండలం కండలేరు బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు భవిష్యత్ చదువులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్ తర్వాత అనేక కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థి తనకు ఏ కోర్సు ఇష్టమో అందులో చేరితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు. అలాగే పర్సనాలిటీ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్‌ను ఎలా పెంపొందించుకోవాలో వివరించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన 22 మందికి బహుమతులు అందజేశారు. 20 మందికి స్పోర్ట్స్ టీ షర్టులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ భారతి, యువకేంద్రం అధికారులు శ్రీనివాసులు, గయాజ్ పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కోట: కొత్తపట్నం పంచాయతీ యమదిన్నెపాళెంలో బుధవారం ఈటిపాకల రమేష్ పూరిల్లు కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని, మంటలను అదుపు చేసేలోపే ఇల్లు కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. అనంతరం తహసీల్దార్ జయజయరావుకు వినతి పత్రం అందజేశాడు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న దాతలు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని మేరీ ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు బుధవారం పలువురు దాతలు దుప్పట్లు పంపిణీ చేశారు. బిర్యాని ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు బెన్ని తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనూష

వెంకటగిరి రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి ఓ అనూష తెలిపారు. వెంకటగిరిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు అనేక చట్టాలు అమలులో ఉన్నాయని తెలిపారు. బాల్య వివాహలతో అనర్థాలు కలుగుతాయని, బాలికలు 18, బాలురు 21 ఏళ్లు పూర్తయిన తర్వాత పెళ్లిళ్లు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గాంధీనాయుడు, రాజారావు, గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

బడి వైపు ఒక అడుగుపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్ బాబు

నాయుడుపేట టౌన్/గూడూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకే డిసెంబర్ 7న బడి వైపు ఒక అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్, నాయుడుపేట ఎంపీడీవో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దారు రాజేంద్ర, ఎంఈవో మునిరత్నం తెలిపారు. నాయుడుపేట, గూడూరు ఎంపీడీవో కార్యాలయాల్లో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులందరినీ సమన్వయం చేస్తూ అన్ని పాఠశాలల్లో డిసెంబర్ 7న మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్స్‌ను నిర్వహించాలన్నారు. ఇందులో ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట సీడీపీవో ఉమామహేశ్వరి, వైద్యాధికారి శంకరయ్య, సాంఘిక సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ సుధామణి, గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్‌రావు, ఎంఈవో సనత్‌కుమార్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఐ నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్: స్మార్ట్ మీటర్లను అమలులోకి తీసుకువచ్చి ప్రజలపై పెను భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు బుధవారం గూడూరు పట్టణం టవర్ క్లాక్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై టీడీపీ, జనసేన నాయకులు నానా యాగీ చేశారని గుర్తు చేశారు. నేడు స్మార్ట్ మీటర్లతో విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకుని వచ్చేందుకు ఎంతో వీలుంటుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల సామాన్యులు అంధకారంలో మగ్గాల్సి వస్తుందని తెలిపారు. ఈ పద్ధతిని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ తిరుపతి జిల్లా కార్యదర్శి మురళీ, సీహెచ్ ప్రభాకర్, కాలేషా, చంద్రయ్య, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌డీఎస్ ప్రోగ్రామ్‌కు హాజరైన వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నవీన

దొరవారిసత్రం: మండలంలోని మావిళ్లపాడు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ సర్వీసెస్ (ఎఫ్‌డీఎస్) ప్రోగ్రామ్‌కు వైద్యులు సైతం హాజరై రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అరకొరగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అన్న శీర్షికన బుధవారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై వైద్యులు స్పందించారు. మావిళ్లపాడులో ఎఫ్‌డీఎస్ కార్యక్రమాన్ని సకాలంలో నిర్వహించడమే కాకుండా తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నవీన హాజరై రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో 104 సిబ్బంది, వైద్య సిబ్బంది. ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


అధిక ఎరువుల వినియోగం అనర్థం

వెంకటగిరి రూరల్/రాపూరు/దొరవారిసత్రం/సైదాపురం/నాయుడుపేట టౌన్ : వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు అధిక ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, విత్తన శుద్ధి, నారుమడుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటను ఆశించిన చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- వెంకటగిరి మండలం పూలరంగడుపల్లి, అక్బర్ నివాస్ కండ్రిగ రైతులతో ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడారు. డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగు చేయడం లాభదాయకమన్నారు. 20 రోజుల తర్వాత కలుపు నివారణ కారణ కార్యక్రమం చేపట్టాలన్నారు.
- రాపూరు మండలం సిద్ధవరం రైతులతో వ్యవసాయ అధికారి సోమసుందర్ మాట్లాడారు. విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్యం పద్ధతుల గురించి వివరించారు.


వెంకటగిరి రూరల్: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు

- దొరవారిసత్రం మండలం ఆనేగొట్టం, కరటాముడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో జ్యోతిర్మయి మాట్లాడుతూ వరి పంటను కాండం తొలిచే పురుగు ఆశించే అవకాశం ఉందని, దాని నివారణకు కార్టప్ హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరంట్రానిలిపోల్ 60 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.
- సైదాపురం మండలంలోని తురిమెర్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో హైమావతి విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్య పద్ధతులపై వివరించారు. నారుమడిలో నీరు ఎక్కువగా నిల్వ ఉంటే వాటిని తొలగించి కేజీ యూరియా, కేజీ పొటాష్‌ను పైపాటుగా వేసుకోవాలన్నారు. తర్వాత కార్బండిజమ్ గ్రాము నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకుముడత తెగుళ్ల నివారణకు కార్టాప్ హైడ్రో క్లోరైడ్ లేదా ఫ్లూబెండిమైడ్‌ను వేసుకోవాలన్నారు. తాము సాగు చేసుకుంటున్న పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు.


సైదాపురం: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

- నాయుడుపేట మండలం అన్నమేడు, వద్దిగుంట కండ్రిగ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరిలో జింకు లోపాన్ని నివారిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి గణేష్ తెలిపారు. వరి పైరులో జింకు సల్ఫేటు, యూరియా తగిన మోతాదులో వాడాలన్నారు.